# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**తేది: 4 మార్చ్, 2019**

**సుప్రీంకోర్టు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను తక్షణం పట్టాలివ్వాలని ఆదేశించాలి.**

## ప్రజా పోరాటాల ద్వారానే ఆదివాసీ ప్రజానీకం తమ అటవీ భూములను కాపాడుకోవాలి. సాగు చేసుకోవాలి.

మన దేశంలోని అడవులలో తగిన ప్రమాణ పత్రాలు (పట్టా) లేకుండా ఉంటున్న వారిని ఖాళీ చేయించాలనీ ఫిబ్రవరి 13 నాడు భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు 21 రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించింది. కానీ అనేక ఆదివాసీ ప్రజా ఉద్యమ సంస్థలు ఏకమై సుప్రీంకోర్టు తన ఆదేశాన్ని ఉపసంహరించుకోవాలని కోరగా అది తన ఆదేశాన్ని జూలై మధ్య వరకు అమలు కాకుండా నిలుపు చేసింది. సుప్రీం కోర్టు ఆదేశం నేపథ్యంలో మా పార్టీ సమస్త ఆదివాసులకు, తరతరాలుగా దేశ అడవులలో నివసిస్తున్న ఆదివాసేతరులకు తమ భూములు వదలుకోకూడదనీ ప్రభుత్వ మెడలువంచి సాగు భూములకు పట్టాలు సాధించాలనీ పిలుపునిస్తోంది.

29 డిశంబర్ 2006 నాడు భారత ప్రభుత్వం 'షెడ్యూల్డ్ తెగలు, అడవులలో నివసిస్తూన్న ఇతరులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం, 2006ను ఉనికిలోకి తెచ్చింది. ఈ చట్టాన్ని 'నూతన అటవీ చట్టం'గా కూడా ప్రజలు వ్యవహరిస్తున్నారు. మన దేశ అడవులలో నివసిస్తున్న ఆదివాసులతో పాటు ఆదివాసేతరులకు ఈ చట్టం ప్రకారం సాగుభూములకు పట్టాలు లభిస్తాయి. అయితే ఆ భూమి సైజు నాలుగు హెక్టార్లు (10 ఎకరాలు) మించకూడదు. ఆదివాసేతరుల విషయంలో మాత్రం భూమి పట్టా లభించడానికి వారు మూడు పిడీలుగా స్థానికంగా (75 సంవత్సరాలు) ఉంటున్న వారై ఉండాలనీ చట్టం స్పష్టం చేసింది. రైతులకు వ్యక్తిగత పట్టాలివ్వడంతో పాటు గ్రామసభ పేరు మీదా సామూహిక పట్టా ఇవ్వాలని కూడా చట్టం తెలిపింది. ఇందుకుగానూ అన్ని గ్రామాలలో 10-15 మందితో కూడిన అటవీ హక్కుల కమిటీని ఏర్పర్చాలనీ, అందులో మూడవ వంతు మహిళలు ఉండాలనీ చట్టం వివరించింది. ఆ కమిటీయే ప్రభుత్వ అధికారులకు తగిన ప్రమాణ పత్రాలను సమర్పించాలని కోరింది. ప్రభుత్వ చట్టంలో ఇంకా అనేక వివరాలు పొందుపర్చారు. సాగులో ఉన్న ఆదివాసుల భూముల విషయంలో మొదట 1998నే కటాఫ్ సంవత్సరంగా నిర్ణయించారు. కానీ ఆ తర్వాత పెల్లుబికిన అనేక ప్రజా పోరాటాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల ఒత్తిళ్లతో 2005ను కటాఫ్ సంవత్సరంగా ప్రకటించారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఆ చట్టంలో ఎక్కడా భూములకు పట్టాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి గడువు మాత్రం నిర్ణయించలేదు. ఇది ఆ చట్టం రూపొందించిన శాసనకర్తల అసలు కౌటిల్యం.

కేంద్రం చట్టం రూపొందించిన మరుక్షణం నుండే కేంద్రం సహ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సదరు విషయాన్ని మీడియా ద్వారా విపరీతంగా ప్రచారం చేశాయి. అడవులలో జీవిస్తున్న ఆదివాసులు మరియు ఆదివాసేతరుల పట్ల ఎంతో ఔదార్యాన్ని ఒలకబోస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రభుత్వం ఆదివాసుల సాగు భూములకు పట్టాలిస్తుందంటూ తెగ ప్రచారం చేశాయి. ఎక్కడికక్కడే దేశంలోని ఆదివాసీ, గైరాదివాసీ రైతులు తమ సాగు భూములకు పట్టాలు కావాలనీ లక్షల సంఖ్యలో ముందుకు వచ్చి ప్రభుత్వాలకు అర్జీలు పెట్టుకున్నారు. అనేక గ్రామాలలో చట్ట ప్రకారం అటవీ హక్కుల కమిటీలనూ ఏర్పరచుకున్నారు. అదే సమయంలో ఒకవైపూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలు మినహా మిగిలిన అడవులలో అటవీ శాఖ అత్యంత చురుగ్గా కదిలి అతి దూకుడుగా రైతులపై విరుచుకపడింది. అనేక సంవత్సరాలుగా అడవులలో ఉంటూ అటవీ భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగాన్ని సదరు భూముల నుండి బేదఖల్ చేయడానికి వారిపై దాడులకు పూనుకుంది. దేశ వ్యాప్తంగా అనేక సంఘటనలు ముందుకు వచ్చి దేశంలో పెద్ద సంచలనాన్ని సృష్టించాయి. అయితే అన్ని రాష్ట్రాలలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో మాత్రం సంఘటిత రైతాంగం ముందు అటవీ శాఖ అధికారులు తోక ముడువక తప్పలేదు. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో రైతాంగం తొలి నుండి సాగు భూముల రక్షణ కోసం మిలిటెంట్‌గా ఉద్యమిస్తూ ప్రభుత్వ పట్టాలతో పని లేకుండానే వాటిని సాగు చేసుకుంటూ పంటలను అనుభవిస్తున్నారు. మరో వైపూ దేశ ప్రజల బాగోగులు, వారి జీవితాలతో అణు మాత్రమైనా సంబంధంలేని శుద్ధ పర్యావరణవాదులు నడుంలు బిగించి ఆదివాసుల సాగు భూములకు పట్టాలు దొరకకుండా చట్టం అమలును అడ్డుకోవడానికి శాయశక్తులా కృషి చేశారు.

దేశంలో గనుల తవ్వకాలు, మావోయిస్టుల కార్యకలాపాలతో ఇప్పటికే ఎంతో నష్టపోతున్న అడవులలో వర్తమాన చట్టం మరింత తగ్గుదలను తెస్తుందనీ వారు లెక్కలు కట్టారు. నూతన అటవీ చట్టంతో దేశంలో 1.25 మిలియన్ హెక్టార్ల అడవులు (27 లక్షల 25వేల

ఎకరాలు) ధ్వంసమవుతున్నాయన్నారు. ఇందులో 2 లక్షల 60వేల హెక్టార్లతో ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ సహా) అగ్ర భాగాన నిలువగా 2, 56వేల హెక్టార్లతో అసోం తదుపరి స్థానంలో ఉండగా అతి మావోయిస్టు ప్రభావిత రాష్ట్రంగా సర్కార్ పేర్కొనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో1లక్షా 19 వేల హెక్టర్ల అటవీ భూములు క్షీణించనున్నాయనీ వారు వాపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో వేగంగా అడవులు క్షీణిస్తున్నాయనీ, ఛత్తీస్‌గఢ్‌లో 86 వేల హెక్టార్ల అటవీ భూములు మైనింగ్ మాఫియా, మావోయిస్టుల రైతులు అక్రమంగా ఆక్రమించారనీ లెక్కలు తేల్చారు. తమ గ్రీన్ ఇండియా మిషన్ కోసం దేశంలో 20 మిలియన్ హెక్టార్ల అడవులను పెంచాలన్నారు. ప్రస్తుతం దేశంలో అడవులు, వృక్షాలతో కూడిన భూభాగం 78.29 మిలియన్‌ల హెక్టార్లు ఉందనీ భౌగోళికంగా ఇది దేశ భూభాగంలో 23.81%శాతం అంటూ గణాంకాలు చూపుతూ నిర్ణీత సమాయావధిలో 'అడవుల ఆక్రమణదారుల'ను మరో మాటలో ఆదివాసులను అడవుల నుండి తొలగించాలనీ వారు కోర్టు కెక్కారు. వాస్తవానికి మన దేశంలో ఇలాంటి వాదనలు ముందుకు రావడం ఇపుడు కొత్తేమి కాదు. 1952 నాటి అటవీ విధానమే వారి జీవితాలను అస్తవ్యస్తం చేసింది. 1960లో ప్రధాని నెహ్రూ కోరికపై దేశంలోని దంతెవాడ, నారాయణపుర్, అహెరీ బ్లాక్‌లతో పాటు 43 ఆదివాసీ బ్లాకులను అధ్యయనం చేసిన వెరియర్ ఎల్విన్-నర్వోనా కమిటీ సిఫారసులను తుంగలో తొక్కుతూ 1976లో జాతీయ వ్యవసాయ కమీషన్ అడవుల క్షీణతకు, విధ్వంసానికి ఆదివాసులనే తప్పు పట్టింది. శుద్ధ పర్యావరణవాదుల వైఖరి పేద ఆదివాసీ ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేస్తుందనీ మా పార్టీ స్పష్టం చేస్తోంది.

13 ఫిబ్రవరి నాటి తన తీర్పును సుప్రీం కోర్టు తాత్కాలికంగా నిలిపి వేసింది. ఆ తీర్పుతో దేశంలో 20 లక్షల ఆదివాసీ, గైరాదివాసీ అడవి జీవుల జీవితాలు ప్రభావితమై దుర్భరంగా మారనున్నాయనీ అనేక ఆదివాసీ సంస్థలు, వ్యక్తులు సుప్రీం కోర్టు ముందుకు వెళ్లడంతో దేశ అత్యున్నత న్యాయస్థానం ఆ నిర్ణయం తీసుకుంది. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో దేశంలోని ఒక్క ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే $4^1/_2$లక్షల ఆదివాసీ కుటుంబాలు వీధుల పాలు కానున్నాయి. వాస్తవానికి నూతన అటవీ చట్టం రూపొంది పుష్కర కాలం గడిచినా ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వమైనా  నిజాయితీగా అటవీ భూముల 'కబ్జా'దారులకు పట్టాలు పంపిణీ చేయనేలేదు. ఈ నేరం రాష్ట్ర ప్రభుత్వాలదే తప్ప ఇంకెవరిదీ కాదు. సుప్రీం కోర్టు కళ్ల గంతలు తొలగించనంతవరకు వాస్తవాలు దానికి అగుపడవు. అసలు నేరస్థులు దర్శనమివ్వరు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు కళ్లు తెరచి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ప్రచారం కాదు తక్షణం సమస్త ఆదివాసీ, గైరాదివాసీ ప్రజలకు నూతన అటవీ చట్టాన్ననుసరించి పట్టాలు పంపిణీ చేయాలనీ ఆదేశించాలనీ మా పార్టీ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరుతోంది.

దేశంలోని అడవులలో నివసిస్తున్న ఏ ఒక్క రైతు కూడా ప్రధానంగా పేద, మధ్య తరగతి రైతాంగం తమ సాగు భూములను వదులుకోకూడదనీ, మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగంతో భుజం-భుజం కలపి న్యాయమైన హక్కుల సాధనకై ఉద్యమించాలనీ మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. దేశంలోని అత్యంత విలువైన అపార అడవులను, సమస్త ప్రకృతి సంపదలను సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల గనుల తవ్వకాలకు, విద్యుత్ ప్రాజెక్ట్‌లకు ఇతర పారిశ్రామిక అవసరాలకు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ధారాదత్తం చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో దేశంలోని రైతాంగం ప్రత్యేకించి ఆదివాసీ రైతాంగం తీవ్రమైన విస్థాపన సమస్యను ఎదుర్కొంటున్నారు. 'స్వాతంత్ర్యా'నంతరం కోట్లాది ఆదివాసులు తమ ఆస్థులను, అస్థిత్వాన్ని కోల్పోయి నగరాలలో మురికి వాడల పాలయ్యారు. వర్తమాన మోదీ అండ్ కంపెనీ పాలనలో అమలవుతున్న  'మేక్ ఇన్ ఇండియా' విధానాల ముందు భూముల నుండి రైతాంగాన్ని బేదఖల్ చేయడానికి ఏ పట్టాలున్నా ఆదుకోవు. కాబట్టి సామ్రాజ్యవాదుల ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సింగూర్, నందిగ్రాం, నియంగిరి, లోహండి గూడ, కోర్చీ, ఝర్లీ, కంతన్‌పెల్లి, విశాఖ, సోంపేట, ఎర్రగుంటపల్లె, సాల్‌కోట్, గొడ్డా రైతుల మార్గంలో తమ భూముల కోసం 'దున్నేవారికే భూమి' నినాద ప్రాతిపదికన రైతాంగం పోరాడకుండా తమ ఆస్థులను, అస్థిత్వాన్నీ కాపాడుకోలేరనీ మా పార్టీ స్పష్టం చేస్తూ పోరాటానికి పిలుపునిస్తోంది.



**అభయ్,**

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**